క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కందుకూరు రూరల్‌: మండలంలోని జి.మేకపాడు పంచాయతీలో బుధవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.విజయశేఖర్‌ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

లింగసముద్రం: పంచాయతీలోని బలిజపాలెంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.9,800 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఆలయ పునః నిర్మాణానికి విరాళాలు

కందుకూరు అర్బన్‌: అంకమ్మతల్లి దేవాలయం పునః నిర్మాణానికి దివంగత ఆముదాలపల్లి కొండయ్య ధర్మపత్ని అచ్చమ్మ జ్ఞాపకార్థం కుమారులు రూ.51,116లను కమిటీ సభ్యులు వెంకటరెడ్డికి అందజేశారు. గొల్ల శ్రీనివాసులు ధర్మపత్ని శ్రీలక్ష్మీ రూ.25,116 అందజేశారు. బంగారు యంత్రం ప్రతిష్టకు ఆముదాలపల్లి మాధవరావు ధర్మపత్ని విజయలక్ష్మి, కుమారులు శివసాయి రూ.5121 అందజేశారు.

నేడు విద్యుత్‌ సరఫరా నిలిపివేత

పామూరు: మండలంలోని నుచ్చుపొద, ఇనిమెర్ల గ్రామ పంచాయతీల పరిధిలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జిలానీబాషా తెలిపారు. పంచాయతీల్లో వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన విద్యుత్‌ ఫీడర్‌లో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయులు జయంతి

కనిగిరి రూరల్‌: కాపునాడు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయలు జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాపునాడు సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్‌ రామయ్య నాయుడు, సంఘ నాయకులు ముండ్లమూరి మాలకొండయ్య, నామా పుల్లయ్య, వెంకటయ్య, బొట్టు శ్రీను, నర్సయ్య, బైరపు కృష్ణా, పసుపులేటి అరుణోదర్‌, బేధం శెట్టి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పొన్నలూరు: మహిళ అదృశ్యంపై పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెదవెంకన్నపాలెం ఎస్సీ కాలనీకి చెందిన పిల్లిపోగు కొండమ్మకు కొన్ని నెలలుగా ఆరోగ్యం బాగోలేదు. దీంతో ఆమెను తన భర్త విలియమ్స్‌ పలు హాస్పిటల్స్‌కి తీసుకెళ్లి వైద్యం చేయించాడు. అయినా సరే కొండమ్మకు ఆరోగ్యం కుదటపడలేదు. ఈ క్రమంలో మనోవేదనకు గురైన కొండమ్మ కుటుంబ సభ్యులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్ల వద్ద, చుట్ట పక్కల గ్రామాల్లో విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.రాజారావు మంగళవారం తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 9121102207కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

ముగిసిన ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులిస్తున్న తుమాటి వెంకట నరసింహారెడ్డి, వాకా వెంకటరెడ్డి తదితరులు

మద్దిపాడు: సంక్రాంతి పండగ సందర్భంగా గుండ్లసముద్రం గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి ముగ్గుల పోటీలు సోమవారం ముగిశాయి. స్పేస్‌ విజన్‌ గ్రూప్స్‌ అధినేత తుమాటి వెంకట నరసింహారెడ్డి, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు, మద్దిపాడు ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వాకా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 23 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని మద్దిపాడుకి చెందిన ఈదుమూడి దీప్తి, రెండో బహుమతిని గుండ్ల సముద్రం గ్రామానికి చెందిన పూనూరి బేబీ కైవసం చేసుకున్నారు. మూడో బహుమతి మద్దిపాడుకి చెందిన ఈదుమూడి కామేశ్వరి, నాలుగు, ఐదో బహుమతులను గుండ్ల సముద్రం గ్రామానికి చెందిన ఎం.శిరీషా, వై.ఆదిలక్ష్మి గెలుపొందారు. కార్యక్రమంలో వాకా సుబ్బారెడ్డి, వాకా అంజిరెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, మారెడ్డి సుబ్బారెడ్డి, దొనకొండ ఎంపీపీ ఉషామురళి, పొదిలి మాజీ సర్పంచ్‌ గీతా, తుమాటి సునీతకుమారి, బూచి లక్ష్మారెడ్డి, బరూరి శివప్రసాద్‌, తూగుట్ల నర్సారెడ్డి పాల్గొన్నారు.

వరి వద్దు.. పత్తి సాగుకే మొగ్గు



నిండుకుండలా రాళ్లపాడు ప్రాజెక్టు



పత్తి పంట

- రాళ్లపాడు ప్రాజెక్టు కింద వరి బదులు పత్తి సాగుకు రైతులు సమాయత్తం
- గతేడాది వచ్చిన లాభాలతో మరోసారి అదే పంట వైపు
- పుష్కలంగా నీరు ఉన్నా వరి సాగుకు రైతులు వెనకడుగు
- అదును దాటిపోవడం, పెట్టుబడులు పెరిగి పోతుండడంతో వరిసాగుపై అనాసక్తి
- ప్రస్తుతం మార్కెట్‌లో తగ్గిన పత్తి రేట్లు

కందుకూరు: నియోజకవర్గంలో ప్రధాన సాగునీటి వనరైన రాళ్లపాడు ప్రాజెక్టు కింద పంటల సాగులో రైతుల ఆలోచనా విధానం మారుతోంది. గత రెండేళ్ల నుంచి మాగాణి సాగుకు బదులు ఆరుతడి పంటల సాగువైపే మొగ్గుచూపుతున్నారు. ప్రధానంగా ఆరుతడి పంటైన పత్తి సాగును చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. పత్తిసాగుతో గతేడాది అధికంగా లాభాలు రావడం, మాగాణి సాగులో ఖర్చులు పెరుగుతుండడంతో ఈ కూడా దాదాపు 90శాతం మంది రైతులు పత్తి పంటను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో రాళ్లపాడు ప్రాజెక్టు కింద ప్రధాన పంట వరి సాగు స్థానంలో పత్తి పంట ప్రధానపంటగా మారుతుంది.

వరి బదులు పత్తి

నియోజకవర్గంలో ప్రధాన సాగునీటి వనరు రాళ్లపాడు ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుపై ఆధారపడి లింగసముద్రం, గుడ్లూరు, వలేటివారిపాలెం మండలాల పరిధిలో అధికారిక, అనధికారిక ఆయకట్టు కలుపుకుని దాదాపు 25వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. ఈ మొత్తం ఆయకట్టులో గతేడాది వరకు మొత్తం వరి సాగునే చేపట్టేవారు. అయితే నాలుగైదు ఏళ్ల సకాలంలో వర్షాలు పడకపోవడంతో ప్రాజెక్టు నిండడం గగనంగా మారింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.1టీఎంసీలు (20అడుగులు). ప్రధానంగా వర్షాలతో పాటు పై నుంచి వచ్చే సోమశిల జలాలతో ప్రాజెక్టును నింపాల్సి ఉంది. వర్షాలు ఆలస్యంగా పడుతుండడం వల్ల ప్రాజెక్టు దాదాపు రెండు నెలల ఆలస్యంగా నిండుతుంది. దీంతో రబీ వరిసాగుకు అదును దాటిపోతుంది. ఆలస్యంగా వరి సాగు చేస్తే చివరిలో నీరు సరిపోక ఇబ్బందులు పడతామని రైతులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరి సాగు బదులు ఆరుతడి పంటల సాగువైపు మొగ్గు చూపుతున్నారు.

నీరిస్తామని చెప్పినా...

ఈ ఏడాది కూడా రైతులు ఆరుతడి పంటలవైపే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు దాదాపు 18 అడుగుల మేర నీరు ఉంది. ఇంకో రెండు అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు నిండుతుంది. వరి సాగుకు నీరు ఇస్తామని ఇప్పటికే ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు. ప్రాజెక్టు కుడి కాల్వకు కూడా పది రోజుల క్రితమే నీరు విడుదల చేశారు. అయినా వరి సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. దీని ప్రధాన కారణం ఇప్పుడు నార్లు పోసి వరి నాట్లు వేయాలంటే ఆలస్యమవుతుందని, అదును దాటిపోయిందని భావిస్తున్నారు. వరి బదులు గతేడాది చేపట్టిన పత్తి సాగుకు రైతులు మంచి లాభాలను తెచ్చిపెట్టింది. దీంతో ఈ ఏడాది కూడా పత్తి పంటను సాగు చేయాలని ప్రాజెక్టు పరిధిలోని దాదాపు 90శాతం మంది రైతులు సిద్ధమవుతున్నారు. ఎక్కువ ఆయకట్టు ఉన్న కుడికాల్వ పరిధిలో ఒకటీ, రెండు గ్రామాలను మినహాయించి మిగిలిన గ్రామాల రైతులంతా పత్తి సాగుకు చేపడుతుండగా, ఎడమ కాల్వ పరిధిలో కొందరు రైతులు ఇప్పుడు నార్లుపోసి వరినాటేందుకు ప్రయత్నం చేస్తున్నారు. కొంతైనా వరి నాటకపోతే పశువుల మేత ఇబ్బంది అవుతుందనే ఆలోచనలో కొందరు రైతులున్నారు.

లాభాల పత్తి

గతేడాది ప్రాజెక్టు కింద సాగు చేసిన పత్తి పంట రైతులకు కాసులు కురిపించింది. ఎకరాకు 15క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. మార్కెట్‌ బాగుండడంతో క్వింటా పత్తి రూ 10 నుంచి 12వేల వరకు విక్రయించారు. దీనికి తోడు సాగు ఖర్చు కూడా తక్కువగా ఉండడంతో రైతులకు మంచి లాభాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది కూడా పత్తి పంట సాగు చేసేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. అయితే ఈ ఏడాది ప్రస్తుతం పత్తిరేట్లు కాస్త తగ్గాయి. క్వింటా పత్తి రూ 5 నుంచి 7వేలు మాత్రమే ఉంది. అయినా ధరలు పెరుగుతాయనే ఆశాభావంతో రైతులు పత్తి వైపే మొగ్గు చూపుతున్నారు.

> **పత్తి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం:**
> రాళ్లపాడు ప్రాజెక్టు కింద రైతులు పత్తి సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో వరి సాగు తగ్గి పత్తి సాగు పెరిగే అవకాశాలున్నాయి. వరి సాగులో ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గుతుండడం..అదే సమయంలో గతేడాది పత్తిలో ఎకరాకు సరాసరిన రూ.50వేల నుంచి లక్ష వరకు ఆదాయం రావడంతో పత్తి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మొత్తం మీద వరి సాగు తగ్గి పత్తిసాగు పెరుగుతుంది.
> — శేషగిరిరావు, వ్యవసాయశాఖ ఏడీఏ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కాకిబంగారుపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

- కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు రూరల్‌: మండలంలోని మహదేవపురం సచివాలయ పరిధిలోని మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి వారు లబ్ధిపొందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, అర్హత ఉండి రాని పథకాలు ఏమైనా ఉంటే తెలియజేయాలన్నారు. కాకిబంగారుపాలెంలో కాలువపై మూత బండలు ఏర్పాటు చేయాలని కోరారు. భూ సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకురాగా రీ సర్వేలో భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. వర్షాలు పడినప్పుడు వాగుపై నుంచి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉందని తూములు ఏర్పాటు చేయాలని కోరారు. తూము ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సచివాలయం వద్ద సమీక్ష నిర్వహించారు. పిల్లలు వివిధ ఉద్యోగాల్లో ఉంటూ తల్లిదండ్రులను పట్టించుకోని వారు చాలా మంది ఉన్నారు. అలాంటి వారు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. అలాంటి వారిని పిల్లలను ఫ్యామిలీ మ్యాపింగ్‌లో తొలగించి తల్లిదండ్రులకు పథకాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఇలాంటివి సచివాలయ సిబ్బంది గమనించి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో ఉండే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేసినప్పుడు నిజమైన అర్హులకు ఫలాలు అందుతాయన్నారు. గడప గడప కార్యక్రమంలో వచ్చిన సమస్యలను మూడు రోజుల్లో సంబంధిత వ్యక్తులకు తెలియజేయాలన్నారు. ఆ సమస్య పరిష్కరించినట్లు వారి వద్ద ఒక లెటర్‌ తీసుకోవాలని చెప్పారు. సమస్యలను పరిష్కరించడంలో సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే ఎంపీడీఓలు చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించి పనులు చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పని చేసినప్పుడు సరైన ఫలితాలు వస్తాయని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు కచ్చితంగా క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.విజయశేఖర్‌, తహసీల్దార్‌ డి.సీతారామయ్య, సర్పంచ్‌ పద్మ, ఎంపీటీసీ ఎం.ఝాన్సీ, ఎంపీపీ ప్రతినిధి ఇంటూరి మాధవరావు, జెడ్పీటీసీ ప్రతినిధి తొట్టెంపూడి శ్రీనివాసరావు, కార్యదర్శి స్వప్న, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం



తాటాకులపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వంలో వరికూటి అశోక్‌బాబు

- కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జ్‌ వరికూటి అశోక్‌బాబు

తాటాకులపాలెం (కొండపి): రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని చినకండ్లగుంట పంచాయతీ తాటాకులపాలెం గ్రామంలో మంగళవారం సాయంత్రం వరికూటి అశోక్‌బాబు అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్సీ కాలనీలో ప్రతి గడపకు తిరుగుతూ సీఎం జగనన్న అందించిన సంక్షేమ ఫలాల గురించి వివరించారు. గత టీడీపీ పాలనలో తమకు న్యాయం జరగలేదని, ఇప్పుడు అన్నీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అశోక్‌బాబుకు గడప గడపలో పేద ప్రజలు తెలిపారు. సీఎం జగనన్నకు ఎప్పుడూ రుణపడి ఉంటామని సంతోషంగా చెప్పారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ నేడు పేద ప్రజలకు అండగా జగనన్న పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలు పేద ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్నాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలో పచ్చ నాయకులు దోచుకోవటం, దాచుకోవటం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీలేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజా సంక్షేమంతో పాటు విద్య, వైద్యం, ఉద్యోగాలు, రోడ్లు తదితర అన్నీ రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. చంద్రబాబు తల కింద పెట్టి తపస్సు చేసినా వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు గెలిచే పరిస్థితి లేదన్నారు. మరో మూడు దశాబ్దాలకు పైగా సీఎంగా జగనన్నే ఉంటారని ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని అన్నారు. గడప గడపకు వచ్చిన అశోక్‌బాబుకు పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులతో కలిసి పూలుచల్లి ఘనస్వాగతం పలికారు. అశోక్‌బాబు గ్రామంలో రచ్చబండ మీద వైఎస్సార్‌ చిత్రపటానికి పూలుచల్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఢాకా పిచ్చిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి అరుణకుమారి, గ్రామ సర్పంచ్‌ వన్నూరు సాహెబ్‌, మాధవరెడ్డి, ఓబుల్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యంతో వ్యాధులు దూరం



పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ

పామూరు: మెరుగైన పారిశుధ్యంతో సీజనల్‌ వ్యాధులు నియంత్రించవచ్చని ఎంపీడీఓ వి.శ్రీనివాసులు అన్నారు. పామూరులో మంగళవారం 4 సచివాలయాల పరిధిలో సచివాలయ, వైద్య, పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనివాసనగర్‌, మల్లాలమ్మ దేవస్థానం, తూర్పువీధి, అంకాళమ్మవీధుల్లో పారిశుధ్యాన్ని పరిశీలించి మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్‌ నిర్వహించి ఆయిల్‌బాల్స్‌ వేయించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎక్కడా మురికినీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు నివాస గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట రజనీకాంత్‌, వైద్యసిబ్బంది మౌనిక, ప్రేమమ్మ, సుబ్బమ్మ, సుజాత, పలువురు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేతో రైతులకు మేలు



రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్‌ సుధాకరరావు

లింగసముద్రం: భూముల రీసర్వే రైతులకు ఎంతో ఉపయోగకరమని తహసీల్దార్‌ సుధాకరరావు అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో డ్రోన్‌ ద్వారా జరుగుతున్న భూముల రీ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ మాట్లాడుతూ ప్రభుత్వం భూముల రీ సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. మండలంలో భూముల రీసర్వే శరవేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల రీ సర్వే చేస్తున్నామన్నారు. సర్వే పూర్తయితే రైతుల భూముల స్థితిగతులు కచ్చితంగా తెలుస్తాయన్నారు. డ్రోన్‌ ద్వారా సర్వే నిర్వహించి ముందుగా ప్రభుత్వ భూములను గుర్తించిన తరువాత గ్రామాల్లోని అన్ని రకాల భూములు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. రెవెన్యూ అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు, నాయకులు కేశంరెడ్డి క్రిష్టారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలి



విజేతలకు బహుమతి అందజేస్తున్న నేతలు

పీసీపల్లి: యువత విద్యతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని వైఎస్సార్‌ సీపీ నాయకుడు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా రెడ్డి కార్పొరేషన్‌ చైర్మన్‌ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గస్థాయి క్రికెట్‌పోటీలు నిర్వహించారు. మంగళవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ క్రీడలు ఐక్యమత్యాన్ని, దేహదారుఢ్యాన్ని, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన అజీస్‌పురం, గోపవరంపల్లి, పీసీపల్లి యూత్‌ ఫోర్స్‌ జట్లకు బహుమతిగా రూ.20 వేలు, రూ.15వేలు, రూ.8వేలు అందజేశారు. మూలగోపాల్‌రెడ్డి, పి.లింగారెడ్డి, వేణుగోపాల్‌, ఫణీంద్ర, జంపాని రమణారెడ్డి, వేణు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్‌ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్‌

లింగసముద్రం: సంక్రాంతిని పురస్కరించుకొని మండలంలోని గంగపాలెంలో ఏర్పాటు చేసిన క్రికెట్‌ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్పంచ్‌ పేలపల్లి మహేష్‌బాబు మంగళవారం బహుమతులు అందజేశారు. క్రికెట్‌లో గంగపాలెం అంబేడ్కర్‌ యూత్‌ టీఎం మొదటి బహుమతి గెలుపొందగా సర్పంచ్‌ రూ.5 వేలు అందజేశారు.

100 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్‌ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామాయిపల్లి, వేములపాడు గ్రామాల్లో శిబిరాలు నిర్వహించారు. వేములపాడులో 56 మందికి, రామాయిపల్లిలో 45 మందికి పరీక్షలు చేశారు. డాక్టర్‌ ప్రతాపురెడ్డి, డాక్టర్‌ సందీప్‌కుమార్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బోర్డును ఢీకొనడంతో తీవ్ర గాయాలు



తీవ్రగాయాలైన ద్విచక్రవాహనదారుడు చిరంజీవి

ఉలవపాడు: జాతీయ రహదారిపై వేగ నియంత్రణకు ఏర్పాటుచేసిన బోర్డును ఢీ కొనడంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కరేడు ర్యాంపు వద్ద మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు..ఒంగోలు శ్రీనగర్‌కాలనీకి చెందిన మార్తాల చిరంజీవి ఒంగోలు నుంచి గుడ్లూరులో ఉన్న బంధువుల ఇంటికి వెళుతున్న సమయంలో కరేడు ర్యాంపు వద్ద వేగం తగ్గించడానికి పోలీసులు ఏర్పాటు చేసిన బోర్డును ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయమైంది. రోడ్‌సేఫ్టీ సిబ్బంది హైవే అంబులెన్స్‌ వాహనంలో ఒంగోలు రిమ్స్‌ వైద్యశాలకు తరలించారు. ఎస్సై త్యాగరాజు సంఘటనా స్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

కందుకూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని రెండో వేలం కేంద్రం నిర్వహణాధికారి కె.రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పామూరు రోడ్డులోని వేలం కేంద్రం వద్ద ఆయన స్వచ్ఛభారత్‌లో భాగంగా పిచ్చిమొక్కల తొలగింపు, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. వేలం కేంద్రం పరిసరాలు రైతులకు మంచి వాతావరణంతో ఆహ్లాదాన్ని ఇచ్చే విధంగా చూస్తున్నామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని సూచించారు. ఆధునిక జీవితంలో మానవమనుగడకు చెట్లు ఎంతో అవసరమనే విషయాన్ని గుర్తించాలన్నారు.

పోటీలకు విశేష స్పందన



బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ, నాయకులు

పామూరు: సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల, ఇతర ఆటల పోటీలు అలరించాయి. స్థానిక ఆక్సిజన్‌ సిటీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్‌ డి.వి.మనోహర్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులపోటీలు, మ్యూజికల్‌ ఛైర్స్‌, కోలాటం, పాటలు, డ్యాన్స్‌పోటీలు ప్రత్యేకతను సంతరించుకున్నారు. ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డిలు విజేతలకు బహుమతులు అందజేశారు. ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులు, ఇతర పోటీల్లో విజేలకు జేవీవీ నాయకుడు డాక్టర్‌ తిరివీధి చెన్నక్రిష్ణ బహుమతులు అందజేశారు. గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఎం రామసుబ్బారెడ్డి, గాజుల పల్లి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్‌, యాటా రాఘవేంద్ర, నాయబ్‌రసూల్‌, ఎంపీటీ నాయబ్‌రసూల్‌ పాల్గొన్నారు.

క్రికెట్‌ పోటీల విజేత ఫ్రెండ్స్‌ లెవెన్‌ జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

సీఎస్‌పురం: కేవైఎఫ్‌ క్రికెట్‌ పోటీల్లో ఫ్రెండ్స్‌ లెవెన్‌ జట్టు విజేతగా నిలిచింది. సంక్రాంతిని పురస్కరించుకొని కోవిలంపాడు యూత్‌ ఫోర్స్‌ ఆధ్వర్యంలో సీఎస్‌పురం, పామూరు మండలాల స్థాయిలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో 38 జట్లు పాల్గొనగా కోవిలంపాడు యూత్‌ఫోర్స్‌- ఫ్రెండ్స్‌ లెవెన్‌ జట్లు మంగళవారం జరిగిన ఫైనల్‌ పోటీల్లో తలపడగా ఫ్రెండ్స్‌ లెవెన్‌ జట్టు విజయం సాధించింది. విజేతలకు ప్రథమ బహుమతి రూ.30,116, ద్వితీయ బహుమతి రూ.20,116, మెమెంటోలు అందజేశారు. నాగంపల్లి జట్టుకు చెందిన కళ్యాణ్‌ను మ్యాన్‌ ఆఫ్‌ ద సిరీస్‌, బెస్ట్‌ బౌలర్‌గా, ఫ్రెండ్స్‌ లెవెన్‌ జట్టుకు చెందిన రవిని బెస్ట్‌ బ్యాట్స్‌మన్‌గా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కోవిలంపాడు సర్పంచ్‌ షేక్‌ ఖాదర్‌బీ బుజ్జి, నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌ దుగ్గిరెడ్డి జయరెడ్డి, పామూరు మండలం దూబగుంట సర్పంచ్‌ కందుల శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌ సీపీ నాయకుడు గోను చంద్రశేఖర్‌రెడ్డి, దుగ్గిరెడ్డి పిచ్చిరెడ్డి, కేవైఎఫ్‌ ఫౌండేషన్‌ నిర్వాహకులు పాల్గొన్నారు.